# రాతి శిలువ

## స్వరూప్ సిన్హా



*శిలువ!*
*రాతితో తయారు చేయబడింది!*
*సుమారొక అడుగు పొడవుంది. ..దాని చుట్టూ ఓ తాడు చుట్టి ఉంది!*

ఆ సాయంకాలం ఏమీ తోచక అలా ఆ నదిలో సరదాకు గాలం వేశాను. చాలా సేపటికి గాలమేదో బరువైన దాన్నే తగులుకున్నట్టనిపించి, అతి కష్టం మీద పైకి లాగిచూస్తే

ఈ రాతిశిలువ దొరికింది 'చేపలు దొరక్క పోగా ఇదేమిటి!' అని నాలో నేను చిరాకు పడుతుండగా 'డాక్టరు బాబూ!' అన్న గంభీరమైన పిలుపు వినిపించి ఉలిక్కిపడ్డాను.

ఆ సాయం సమయం, ఆ నదీ ప్రాంతంలో నేను తప్ప వేరే ఎవ్వరూ లేరనుకున్నాను. కానీ. .ఇతనెవరో, ఇంతకు ముందెప్పుడూ ఈ ప్రాంతాల్లో అగుపించిన గుర్తులేదు ..! ఎత్తుగా బలిష్టంగా ఉన్నాడు. వయసు సుమారు మూడు పదులుండొచ్చు. .

"ఆ శిలువను మళ్లీ నదిలోనే పారేయండి డాక్టర్‌బాబూ, దాని వల్ల మీకు మంచి జరగదు!" అతని మాటలు నాకు చిత్రంగా తోచాయి. ఈ కొండ ప్రాంతం ప్రజలు చాలా మంది క్రైస్తవ మిషనరీల బోధలకు ప్రభావితులై క్రైస్తవ మతం పుచ్చుకున్న వారే! ఈ సంగతి నేనొచ్చిన వారంలోనే గమనించాను. ఈ మారుమూల కొండ ప్రాంతానికి, నాగరీక ప్రపంచానికీ ఒకప్పుడు అసలు సంబంధమే ఉండేది కాదు. మొట్టమొదట ఈ ప్రాంతాల్లోని కడుగుపెట్టిన వారు క్రైస్తవ మిషనరీలే! ఆ తరువాతే, క్రమంగా గవర్నమెంటు డాక్టర్లు, ఇతర ప్రభుత్వోద్యోగులూ ఇక్కడికి రావడం మొదలయ్యింది. విచక్షణ ఉన్న ఏ గవర్నమెంటు డాక్టరూ ఈ మారుమూల ప్రాంతాలకి వచ్చి పని చెయ్యడానికొప్పుకోడు

ఇక్కడి ప్రజలిప్పుడిప్పుడే తెలుగు భాష నేర్చుకుంటున్నారు. ఇంకా ఆదిమ జాతి మానవుల ఆచార వ్యవహారాలు సమసిపోని ఈ జాతి ప్రజల మధ్యకు నేను కావాలనే ట్రాన్స్‌ఫర్ చెయించుకొచ్చాను. రోగులకు గొప్పగా సేవ చేసేద్దామని కాదు నా ఉద్దేశం! నాకో విధమైన 'సుపీరియారిటీ కాంప్లెక్స్' ఉంది! చిన్నప్పట్నించి నన్నునేను మిగతా మనుషుల కంటే ఓ మెట్టు పైనే ఊహించుకునే వాణ్ణి. అందరూ భయపడే విషయాలను అతి తేలిగ్గా తీసిపారేస్తూ, గొప్ప 'హీరోయిజాన్ని' ప్రదర్శిస్తూండేవాణ్ణి! జీవితంలో గొప్ప గొప్ప 'అడ్వెంచర్స్' చేసిపారెయ్యాలని నా అభిలాష. నా యీ కోరికకు నా ఒంటరితనం ప్రోత్సాహాన్నిచ్చింది.

ఏ బాదరబందీ లేని వాణ్ణి...నా సాహసకార్యాలకు ఇదే మంచి తరుణమన్పించింది. అందుకే ఎవరూ వెళ్ల సాహసించని ఈ ప్రాంతానికి 'ట్రాన్స్‌ఫర్ ప్రపోజల్' రాగానే, సంతోషంగా 'సరే'నన్నాను. దానికి తగ్గట్టే ఇక్కడి జనం నన్ను 'డాక్టరుబాబూ' అంటూ నన్నో దేవుణ్ణి పూజించినట్టే పూజించసాగేరు. వీళ్ల దృష్టిలో నేనొక రోగాలు మాయం చేసే దేవుణ్ణి మరి! వీళ్లెంత క్రూరులో అంత అమాయకులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని క్రైస్తవ మిషనరీలు వీరిని మతంలోనికి మార్చేస్తున్నారని నాకు కంటగింపుగా కూడా ఉండేది. అలాంటి ప్రజల్లోని ఒక వ్యక్తి, ఈ శిలువను మళ్లీ నదిలో పారేయమనటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఏం, నీకు క్రీస్తు మీద నమ్మకం లేదా..? ఈ ప్రాంతం వారంతా మతం పుచ్చుకున్న వారే గదా?" అన్నాను నవ్వుతూ.

"నమ్మకం ఉంది బాబూ. కానీ ఈ శిలువకు వేరే కథ ఉంది!" అతని కళ్లల్లో ఏదో వేదన ఉంది. అవి గతాన్ని వెల్లడి చెయ్యడానికేమో అసహనంగా కదుల్తున్నాయి. నాలో ఎక్కడ లేని ఉత్సాహం పుట్టుకొచ్చింది ఇతనేదో ఖచ్చితంగా 'ఎడ్వెంచర్' గురించే చెప్పబోతున్నట్టు తోచింది. పరీక్షగా అతన్నే చూస్తూ కూచున్నాను. అతను నాకెదురుగా ఉండే రాతి మీద కూచుని చెప్పడం మొదలు పెట్టాడు ప్రశాంతమైన ఆ నది ఒడ్డున సాయంకాలపు నీరెండలో అతని గొంతు స్పష్టంగా, గంభీరంగా వినిపిస్తూ ఉంది. అక్కడ అప్పుడప్పుడూ పక్షుల కిలకిలలు తప్ప మరే విధమైన ఇతర చప్పుడూ వినిపించడం లేదు అతని గొంతు తప్ప!

"సుమారు పద్దెనిమిదేళ్ల క్రిందటి మాట డాక్టరు బాబూ! అప్పుడప్పుడే ఈ ప్రాంతానికి మిషనరీలు రావడం మొదలయ్యింది. అప్పట్లో ఇక్కడి ప్రజలెవరు అలాటి బోధలు వినే వారు కాదు. తమ దేవతలపైకి పోటీగా ఆ క్రైస్తవ మిషనరీలు వేరే దేవతనెవరినో తెస్తున్నారని వారిని శత్రువులుగా చూసే వారు. ఆ వచ్చిన వాళ్లకి తిట్లూ తన్నులూ తప్పేవి కావు. ఆయాతన తట్టుకోలేక చాలా మంది వచ్చిన దారినే పలాయనం చిత్తగించే వారు. కానీ ఒక్క మిషనరీ....అతని పేరు ఫ్రాన్సిస్, అతనికి మాత్రం ఎలాటి అవాంతరాలూ ఎదురవ్వలేదు. అతనికి సుమారు పాతికేళ్లుండేవి. ఎత్తుగా, అందంగా ఉండే వాడు. అన్నిట్నీ మించి అతని కళ్లల్లో ఏదో ఆకర్షణ శక్తి ఉండేది కాబోలు! తన స్వచ్ఛమైన గొంతెత్తి పాటలు పాడుతూ, బోధలు మొదలుపెట్టేటప్పటికి, ఆడా మగా, పిల్లా పెద్దా అంతా అతని చుట్టూ మూగిపోయే వారు. క్రీస్తును గురించి అతను గంటల తరబడి బోధించి ప్రార్థనలు జరిపేవాడు. ప్రజలు క్రమంగా అతని బోధనల వైపు ఆకర్షితులవ్వడం ప్రారంభించారు. త్వరలోనే చాలా మంది మతం పుచ్చుకున్నారు కూడా"

"మరి వాళ్లనించి ప్రతిఘటనేమీ ఎదురుకాలేదా?" అసహనంగా అడిగాను. జనం అలా లొంగిపోవడం నాకు ఎందుకో గానీ అసూయను కలిగించింది.

"అవకేం? ఎన్నెన్నో ఎదురయ్యేవి. మూఢాచారాలకు కొదవేమీ ఉండేది కాదు. ముఖ్యంగా పురుషులు యవ్వన దశలోని కడుగుపెట్టేటప్పుడు 'గినువా' అనే వీళ్ల దేవుడు వహిస్తాడని వీళ్ల నమ్మేవారు పధ్నాలుగు పదిహేనేళ్ల ప్రాయపు కుర్రాళ్లకు గొంతు మారడం మొదలైన లక్షణాలు కనబడగానే, అమావాస్య రాత్రి వారిని దిగంబరంగా ఊరేగిస్తూ ఊరివతలికి తీసుకెళ్లి, రాళ్లు బాణాలూ వేసి కొట్టేవాళ్లు. అలా చెయ్యడం వల్ల గినువా ప్రసన్నుడై ఆ పురుషుడు భవిష్యత్తులో చేసే పాపాలన్నింటినీ క్షమించేసి అతనికి బ్రతికినంత కాలం మంచి చేస్తాడని వారి విశ్వాసం. ఈ తంతునంతా ఆడాళ్లూ, పిల్లలూ చూస్తే చనిపోతారన్నది ఓ నమ్మకం! వాళ్లనా సమయంలో ఇళ్లల్లో కట్టుదిట్టం చేసి ఇదంతా జరిగించేవారు. ఈ చిత్రహింస కుర్రాళ్లకి నరకప్రాయంగా ఉండేది. వారి ఆక్రందనలతో దిక్కులు మారుమ్రోగిపోయేవి. ఇలాటి తంతొకటి జరుగుతుంటే ఓ నాడు ఫ్రాన్సిస్ అడ్డుకున్నాడు. జనం ఉగ్రులైపోయారు. తమ ఆచారాల్లో జోక్యం కలిగించుకుంటే మాత్రం నిర్దాక్షిణ్యంగా చంపేస్తామన్నారు. అదేమి చిత్రమో గానీ అతను 'అలాగే చంపండ'ని చిరునవ్వుతో ఎదురుగా నించున్నప్పుడు మాత్రం ఎవ్వరూ కనీసం అడుగు కూడా మెదపలేకపోయారు. అప్పుడతను ఆ కుర్రాళ్ణి బట్టలు తొడుక్కొమ్మని వాళ్లందర్నీ తన పాకలోనికి తీసికెళ్లి కూచోబెట్టాడు. యవ్వన ప్రాంగణంలోని కడుగుపెట్టే స్త్రీ పురుషుల్లో సహజంగా జరిగే మార్పులను వారి కర్థమయ్యేట్టు విడమర్చి చెప్పాడతను. అలాగే మానవ శరీరం గురించి, ఆరోగ్యం గురించీ ఎన్నో విషయాల్ని ఎంతో అనుభవమున్న టీచరులాగే వాళ్లకు బోధించాడు. అతను మాట్లాడినంత సేపూ జనం కిక్కురు మనకుండా విన్నారు. ఆ తరువాత వాళ్లు ఆ దురాచారాన్ని మానుకున్నారు........"

## టి.వి. చిత్రంలో
## దిలీప్‌కుమార్



ఒకనాటి మేటి నటుడు, యిప్పటికీ తన నటనకో ప్రత్యేకతను సంతరించుకున్న దిలీప్‌కుమార్ టి.వి చిత్రంలో నటిస్తున్నాడట.

'ది బైబిల్' అనే ఈ టి.వి. చిత్రంలో దిలీప్‌కుమార్‌కు అబ్రహాం పాత్ర లభించిందట. దిలీప్‌కు తగిన పాత్ర యిచ్చిన ఈ చిత్ర నిర్మాతలు ఎంతైనా అభినందనీయులే తన నటనతో యిన్నాళ్లూ సినిమా ప్రేక్షకులను రంజింపజేసిన దిలీప్ యిప్పుడు టి.వి. ప్రేక్షకుల ప్రశంసలందుకోగలడేమో చూడాలి!

"ఓహో......! ఆ 'ఫ్రాన్సిస్' వీళ్ల పాలిటి ఓ గొప్ప హీరో అయిపోయాడన్న మాట.....!" వద్దనుకుంటున్నా వ్యంగ్యం ధ్వనించింది నా గొంతులో.

"అంతే కాదు బాబూ! అతనొక దేవుడై పోయాడు. వీళ్ల దృష్టిలో అతన్ని దేవుడిగానే ఈ జనం పూజించేవారు. అప్పట్లో మీలాటి డాక్టరెవరూ ఇక్కడ లేరు. వీళ్లకేదైనా రోగ మొస్తే అది దేవతల శాపంగానే భావించేవారు. ఓ నాడు వాళ్ల కులపెద్ద కొడుక్కి విపరీత మైన కడుపునెప్పి వచ్చింది. వీళ్ల మామూలు మంత్రతంత్రాలేవీ పని చెయ్యకపోగా కుర్రాడు నొప్పితో మెలికలు తిరిగిపోతూ పెద్ద పెట్టున శోకాలు పెట్టే పరిస్థితి వచ్చింది. వాణ్ణి ఫ్రాన్సిస్ దగ్గరకు మోసుకుపోయారు. అతను వాణ్ణి నేల మీద పడుకోబెట్టి, ఒళ్లంతా నిమిరి కళ్లుమూసుకుని చాలా సేపు ప్రార్థించాడు. తరువాత కళ్లు తెరిచి వాడికి చేయూతనిచ్చి లేపి నించోబెట్టాడు. ఆ కుర్రాడి కడుపు నొప్పి ఆ క్షణంతో మాయమయింది. ఆ తరవాత కూడా అతనెంతో మంది రోగాల్ని నయం చేసాడు. అంటే అన్నీ కేవలం ప్రార్థనలతోనే కాదనుకోండి! రోగాలకు తగ్గ వైద్యం కూడా చెసేవాడు. అయినా జనం అతన్నే దేవుడి అవతారంగా భావించి పూజించే వారు...."

## రాతిశిలువ

"సరేలే! ఈ శిలువ మాటేమిటి?" ఇదంతా కేవలం కట్టుకథలా తోచి, ఆపైన వినే ఓపిక నశించింది నాలో! అందుకే అతన్ని ఇక చెప్పనివ్వకుండా అడ్డుపడ్డాను, ఆవులిస్తూ......

"అదే బాబూ, చెప్తున్నా. అలాటివా డతను. కానీ ఒకే ఒక్క తప్పు చేసాడు, ఈ జాతి పిల్లయిన సుగిజీని ప్రేమిం చడం........!"

నా నవ్వుతో ఆ నదీతీరం మార్మోగి పోయింది. అయినా అతనేమీ చలించినట్టు అనుపించలేదు. "ఆహో......! అయితే మన హీరో గొప్ప గ్రంధ కర్తే నన్నమాట. అయినా ప్రేమించడం తప్పెలా అవుతుంది?" అడిగా న్నేను నవ్వుతూనే.

"ఇతని విషయంలో తప్పే అయ్యింది. ఆ అమ్మాయి అతని వల్ల గర్భవతైంది ." ఈ సారి చప్పట్లు కొట్టాన్నేను. మతం, దేవుడు, దెయ్యం అని ప్రాకులాడే వారంతా 'హిపోక్రైట్స్' అని నా నమ్మకం! 'దేవుడు, దేవుడు' అంటూ తిరిగే వాళ్ల అసలు రంగు ఇలా బయటపడటం నాకెంతో ఆనందాన్ని చ్చింది. అనాది నుంచీ 'సెక్సు' బలహీ నతకు మనిషన్నవాడు లొంగుతూనే వస్తు న్నాడు. ఇక ఈ క్షుద్ర మిషనరీ సంగతి సరేసరి! వీళ్ల దృష్టిలో ఇదొక ఘోరమైన పాపమయ్యుండొచ్చు. కానీ డాక్టరుగా నాకది ఆరోగ్య కరమైన లక్షణంగానే అగుపించింది ఫ్రాన్సిస్ విషయంలో అతను చెప్పే దాంట్లో ఆసక్తి పెరిగింది మళ్లీ నాకు!

"అయితే మాత్రమేం, అతనా అమ్మా యిని పెళ్లి చేసుకుంటే సరిపోయేదిగా?" అన్నాను.

"అతను చేసుకుంటాననే అన్నాడు. ఆ అమ్మాయినతను మనస్ఫూర్తిగా ప్రేమించానని, ఆమెనేనాడో తన భార్యగా అంగీకరించాననీ, అందుకు వాళ్ల ఆచారం ప్రకారమే ఆమెను వివాహమాడ్డానిక్కూడా తనకేం అభ్యంతరం లేదన్నాడు కానీ అందుకు వీళ్లేమాత్రమూ ఒప్పుకోలేదు."

"అదేం, ఎందుకొప్పుకోలేదూ?"అన్నాను ఆశ్చర్యంగా.

"అతను చేసిన పెద్దపొరబాటు ఒకటే బాబూ! ఈ అమాయకులకి క్రీస్తు జీవితాన్ని పూసగుచ్చినట్టు బోధించడమే!"

"అదెలా?" నాలో ఆశ్చర్యం రెట్టింప



జీవితంలోని ఉద్రిక్తతలు
మిమ్మల్ని మందగొడిగా చేస్తున్నాయా?
జీవితం కష్టమైంది పనిలో ఉద్రిక్తత ఇంట్లో సమస్యలు నీ శరీరానికి హాని కల్పించే విధంగా మనసును మలుసాయి దీనితో నిస్పృహతో కూడిన మందగొడితనం, నిర్వీర్యం మానసికంగా శారీరికంగా అలసట నిస్సత్తువ సంక్రమిస్తాయి కాని ఇప్పుడు ఈ సమస్యలన్నిటికి గట్టి మందు ఉంది "వైద్యనాథ్- వీటా-ఎక్స్" కేవలం రోజూ రెండు మాత్రలు వేసుకోండి మిమ్మల్ని చూసుకుని మీరే ఆశ్చర్యపడతారు

Baidyanath
VITA-EX




Baidyanath
VITA-EX
మరీమరీ చురుకుదనానికీ-శక్తికీ.
అన్ని ప్రముఖ మందుల షాపులలో దొరుకుతుంది

BIVE/57/Tel



**Tourist Services in North India**

మా స్వంత డీలక్స్/సూపర్ డీలక్స్(Video) బస్సులు ఉత్తర భారతదేశమందలి ముఖ్యమైన చారిత్రాత్మక ప్రాంతములు మరియు పుణ్యక్షేత్రములకు ఢిల్లీనగరం, తాజ్‌మహల్, మధుర, బృందావన్, ముస్సోరి, బదరీనాథ్, కేదార్‌నాథ్, హరిద్వార్, జైపూర్, సిమ్లా, కాశ్మీర్, శ్రీనగర్, గుల్మార్గ్, పహల్‌గామ్, కురుక్షేత్రం, భాక్రాడామ్ మరియు చండీఘర్, నిర్ణీత రోజులలో ఢిల్లీ నుంచి బయలుదేరును.

Available 27, 35,50 Seater Super Delux Video Coaches on Contract for Groups Our receipts are approved for LFC .

**Accommodation & Meals**

అధునాతన సౌకర్యములతో తెలుగు వారిచే ప్రప్రథమముగా నడుపబ డుచున్న భోజన ఫలహారశాల మరియు విశ్రాంతి గృహమైన హోటల్ సదరన్ (మా అనుబంధ సంస్థ)లో మీరు ఢిల్లీలో ఉన్నప్పుడు బస చేయవచ్చును

65 Rooms with Attached Bath and Toilets, Halls for Groups, Colour T V and Lift With Moderate Tariff

వివరములకు:

SOUTHERN TRAVELS (Regd)
Winners of Transworld Gold Medal
(ఢిల్లీలోని తెలుగు వారి ఏకైక వాణిజ్య సంస్థ)
Arya Samaj Road, Karolbagh,
NEW DELHI 110 005
Phones 572 2210 (6 Lines)-5739508
Madras Office Ph 31553
Hyderabad Office 227233

SUVARNA

య్యింది.

"ఈ జనం వట్టి మూర్ఖులు బాబూ! అతను 'నేను దేవుణ్ణి కాను, నేనూ మీలాటి మనిషినే!' అని నెత్తి నోరూ కొట్టుకుని ఎంత చెప్పినా వినలేదు. వీళ్ల ఫ్రాన్సిస్‌నే క్రీస్తు అవతారంగా భావించారు. అందుకే అతను చేసిన తప్పుకు నిర్దాక్షిణ్యంగా శిక్ష విధించారు".

"అతన్ని క్రీస్తుగా భావించినంత వరకూ బాగానే ఉంది గానీ శిక్షించాల్సిన అవసరమేముంది?" అతను చెప్పేది నాకే మాత్రమూ అర్థం కాలేదు.

"వీళ్ల వాదన వేరు బాబూ! క్రీస్తు బ్రతికిన ముప్పై మూడేళ్లూ పవిత్రంగా ఒంటరి జీవితాన్నే గడిపాడు. అతని జీవితంలో ఏ స్త్రీ కూడా చోటు చేసుకోలేదు. కానీ ఫ్రాన్సిస్ ఓ స్త్రీతో సంబంధం పెట్టుకున్నాడు. అయితే వీళ్లు ఇతన్నీ దేవుడిగానే భావించారు. ఒక వేళ ఇతనూ క్రీస్తులాగే తిరిగి బ్రతుకుతాడని ఓ మూఢ విశ్వాసాన్ని పెంచుకున్నారు. ........."

"మరి ఫ్రాన్సిస్ వారి వాదననంగీకరించి ఎలా ఊరుకున్నాడు? తప్పించుకోవడానికి ప్రయత్నించలేదా?"

"ఆ అవకాశాన్ని వీళ్లు యిస్తేగా? సుగిజీ సంగతి తెలిసిన మరుక్షణం నుంచీ ఫ్రాన్సిస్‌ను అతని గుడిసె కదలకుండా కట్టుదిట్టం చేసారు. అక్కడికీ ఓ రాత్రి ఫ్రాన్సిస్ సుగిజీని, తీసుకుని పారిపోవడానికి చేసిన ప్రయత్నం కూడా విఫలమైపోయింది..."

"ఆ తరువాతేం జరిగింది?" నాలో ఉత్సుకత పెరిగిపోతోంది.

"ఫ్రాన్సిస్ ఇక ఈ ప్రజల్తో వాదించి లాభంలేదనుకున్నాడేమో, ఆ తరవాత పారిపోవడానికెలాంటి ప్రయత్నమూ చెయ్యలేదు. చిట్ట చివరగా తను చనిపోయాక సుగిజీకి ఎలాటి అపకారమూ చెయ్యబోమని వారి దగ్గర మాట మాత్రం తీసుకున్నాడు."

"అంటే, అతన్ని వీళ్లు చంపేసారా?" గుండెల్లో ఏదో మూల ఫ్రాన్సిస్‌పై సానుభూతిలాటిది కలిగింది నాలో!

"సరిగ్గా ఇలాంటి సాయంకాలమే మేళ తాళాలతో అతన్ని ఊరేగిస్తూ ఈ నదీతీరానికి తెచ్చారు. అడ్డుపడబోయిన మిగతా మిషనరీలను వారి వారి నివాసాల్లో కట్టిపడేసారు. ఇదుగో, ఇప్పుడు మీ చేతిలో వున్న రాతి శిలువను అతని మెడలో కట్టేరు. అతని చేతులూ, కాళ్లూ కట్టేసి "నువ్వు దేవుడివి.... నువ్వే దేవుడివి!" అని అరుస్తూ, నాట్యం చేస్తూ చివరికీ నదిలోనికి విసిరేసారు. చిత్రమేమిటంటే అతన్ని అలా చంపిం తర్వాత కూడా అమాయకులైన ఈ జనం అతను మళ్లీ బ్రతుకుతాడనే ఏశ్వసించారు.!"

నాకు వళ్లంతా చెమట పట్టింది. అన్యాయంగా చనిపోయిన ఆ మిషనరీ మీద జాలి కలిగింది.

"పాపం, అతనలా క్షణికమైన దౌర్బల్యానికి లొంగకుండా ఉండి ఉంటే ఇలా అర్థాంతరంగా ప్రాణాలు పోగొట్టుకునే వాడు కాదు!" నాలో నేను అనుకుంటున్నట్టె పైకి అన్నాను నెమ్మదిగా.

"నిజానికి అతనే దౌర్బల్యానికి లొంగిలేదు బాబూ!" అన్నాడతను.

"ఏమిటి నువ్వంటున్నది? మరింత వరకూ నువ్వు చెప్పిందేమిటి" అన్నాన చిరాగ్గా అతనివైపు చూస్తూ.

"నేనింత వరకూ చెప్పింది లోకానికి తెలిసిన నిజం బాబూ! అసలు నిజానికి ఫ్రాన్సిస్ ఏ అమ్మాయినీ ప్రేమించలేదు, దౌర్బల్యానికి లొంగి సంబంధమూ పెట్టుకోలేదు... .."

"మరి, జనం అతన్నెందుకు చంపినట్టో" అసహనంగా అడిగాను.

"ఓ నాడు అడవిలోకి సర్వేకొచ్చిన ఆఫీసర్లెవరో ఒంటరిగా అడవిలో కనిపించిన సుగిజీని మానభంగం చేసి ఈ కొండ జాతి వారి శిక్షకు గురికావల్సి వస్తుందేమోనని భయపడి పారిపోయారు. కొన్నాళ్లకు ఫలితాన్ని తెలుసుకున్న ఆ అమ్మాయి రక్షించమని ఫ్రాన్సిస్ కాళ్లపై పడింది. ఎందుకంటే పెళ్లికాకుండానే గర్భవతైందని తెలిస్తే ఆ స్త్రీని రాళ్లతో కొట్టి హింసించి చంపడం వీళ్ల ఆనవాయితీ! ఆమెను రక్షించడానికి అతనలా చెప్పాల్సి వచ్చింది. చివరకతని ప్రాణాలకే ముప్పు వాటిల్లబోతూందని తెలుసుకుని, సుగిజీ నిజం చెప్పేస్తానని ఫ్రాన్సిస్‌నెంతో బ్రతిమాలింది. అయినా అతనా అమ్మాయిని వారించి, తను పోయాక్కూడా ఆమెకెలాటి ముప్పూ రాకుండా కట్టుదిట్టం చేసి, ఆమెకోసం తన ప్రాణాల్నే బలి యిచ్చాడు......."

ఈ నిజం నమ్మశక్యంగా అనిపించలేదు నాకు. అందుకే అన్నాను,

"అంతా తెలిసినట్టే, చూసినట్టే చెపుతున్నావు.........ఈ నిజం నీకు మాత్రమెలా తెలుసు?" అంటూ అతనివైపు తిరిగాను. అతనక్కడ లేదు. చుట్టూ చూసాను. ఎక్కడా ఏ విధమైన జనసంచారమూ లేదు. ఒకవేళ అతను వెళ్లిపోతూ ఉన్నట్లయితే నా కళ్లెదుట ఉన్న కాలిబాటన అతను కనిపించాలి! కానీ అతని నీడ కూడా నాకా పరిసరాల్లో కనిపించట్లేదు. 'నేనింత సేపూ మాట్లాడిందెవరితో.......?!' నా ఒళ్లు గగుర్పొడిచింది. అప్పటికే కనుచీకటి పడుతోంది. నదిలో నీరు ప్రవహించే చప్పుడు తప్ప మరే అలికిడీ లేదు. నా రక్తం గడ్డ కట్టుకుపోతున్నట్టనిపించింది. అడుగు తీసి అడుగు వేద్దామన్నా సాధ్యం కావటం లేదు. అప్రయత్నంగానే నా చేతుల్లోంచి జారి తిరిగి నదిలో పడిపోయింది ఆ రాతి శిలువ . ●




అనేక మందితో అన్ని 'రకాల' స్నేహం వున్న రేఖకు దగ్గరైన వ్యక్తెవరో ఎవ్వరికీ అంతుచిక్కడంలేదట. ఈమె 'వ్యవహారం' గురించి పరిశ్రమలో రకర కాల వదంతులున్నప్పటికీ 'ఆ'వ్యక్తెవరో తెలియనట్టే ప్రవర్తిస్తోంది రేఖ.

ఇదిట్లా వుండగా 'జాదుగర్ని' అనే చిత్రంలో టైటిల్ పాత్ర పోషిస్తున్న రేఖ సరసన అమితాబ్ నటిస్తున్నాడు.

శేష్‌నాగ్ చిత్రం నిర్మిస్తున్న నిర్మాతలే ఈ చిత్రాన్ని కూడా అందిస్తున్నారు